క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



జగన్నాథపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ సుప్రియ

చింతకాని: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ మండల ఏఈ సుప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాధపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలని, ప్రభుత్వం విడతల వారీగా డబ్బులను లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమాచారి, కాంగ్రెస్ నాయకులు నాగార్జున్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సైదా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వైరా: డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం వైరాలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ యమున చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాక్లెట్లు, బిస్కెట్లు వంటి తినుబండారాలలో మత్తు పదార్థాలు కలిపి చిన్న వయసులోనే బాల బాలికలను మత్తుకు బానిసలు చేస్తున్నారన్నారు. చిన్నారులు తెలియని వ్యక్తులు ఇచ్చిన వస్తువులు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



పండిళ్లపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతకాని: మండలంలోని పండిళ్లపల్లి, బస్వాపురం, నేరడ, ప్రొద్దుటూరు గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానికులకు పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ సదర్భంగా మండల వైద్యాధికారి ఆల్తాఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి నీటి నిల్వలు తొలగించి, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పల్లె దావఖానా వైద్యులు తబుసుం, సోహెల్, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేచల్‌రాణి, ఏఎన్‌ఎంలు పద్మ, జయమ్మ, సరళ, సంధ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

కొణిజర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మేరుగు రమణ తెలిపారు. మంగళవారం తనికెళ్లలో.. బషీర్‌బాగ్ పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రామారావు, ప్రభాకర్‌రావు, వెంకయ్య, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సేవలపై ప్రభావం..

- జీపీఓలుగా వార్డు ఆఫీసర్ల నియామకం..
- మున్సిపల్ విధుల నుంచి రిలీవ్..



సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం



వార్డు ఆఫీసర్లు రిలీవ్ కావటంతో సందడి లేని కార్యాలయం

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు వార్డు ఆఫీసర్లుగా పని చేసిన ఉద్యోగులు రిలీవ్ అయ్యారు. దీంతో మున్సిపాలిటీల్లో సేవలపై ప్రభావం చూపనుంది. జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను వార్డు ఆఫీసర్లుగా నియమించింది. రెవెన్యూశాఖలో పని చేస్తున్న వీఆర్‌ఏ, వీఆర్‌ఓ పోస్టులను రద్దు చేసి మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ బదిలీ చేసింది. 2022 ఆగస్టులో వీఆర్‌ఓలు, 2023 ఆగస్టులో వీఆర్‌ఏలను వార్డు ఆఫీసర్లుగా మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

జీపీఓలుగా మాతృశాఖకు నియామకం..

కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా గ్రామ పాలన అధికారుల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ శాఖలో పని చేసేందుకు గత రెవెన్యూశాఖలో పని చేసిన వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను తిరిగి రెవెన్యూశాఖలో పని చేసేందుకు ఆప్షన్ ఇచ్చింది. అదే విధంగా ఇటీవల జీపీఓ పరీక్ష నిర్వహించి అర్హులైన వారిని మాతృశాఖ రెవెన్యూశాఖలోకి బదిలీ చేసింది.

మున్సిపల్ పాలనపై ప్రభావం..

వార్డు ఆఫీసర్లకు కళకళలాడిన మున్సిపాలిటీలు ఒక్కసారిగా పదుల సంఖ్యలో ఉద్యోగులు రిలీవ్ కావటంతో ఆయా కార్యాలయాల్లో సందడి లోపించింది. ఇప్పటి వరకు వార్డు ఆఫీసర్లు ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తూ మున్సిపాలిటీలకు సంబంధించిన ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయటం, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ప్రజాపాలన తదితర ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత పక్కాగా నిర్వర్తించటంలో నిమగ్నమయ్యారు. ఇప్పుడిప్పుడే మున్సిపాలిటీల్లో వీరి సేవలను ప్రజల నుంచి గుర్తింపు వస్తున్న తరుణంలో ప్రభుత్వం గ్రామ రెవెన్యూ పరిపాలన వ్యవస్థను తిరిగి పునఃప్రారంభించింది. సత్తుపల్లి మున్సిపాలిటీలో 15మంది, మధిరలో 14మంది, వైరాలో 13మంది చొప్పున రిలీవ్ అయ్యారు.

కాళోజీకి ఘన నివాళి

తెలంగాణ భాషా దినోత్సవం

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలల్లో కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కాళోజీ తెలంగాణ సమాజాన్ని, తెలంగాణ ప్రజలను తన కవిత్వం, రచనల ద్వారా చైతన్య వంతం చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలల్లో ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: ప్రభుత్వ ఆస్పత్రిలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది



సత్తుపల్లిరూరల్: గంగారం బెటాలియన్‌లో.. నివాళులర్పిస్తున్న సహాయపు కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి



సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలో.. కమిషనర్ కె.నర్సింహా, ఉద్యోగులు



బోనకల్: ముష్టికుంట్ల జీపీలో..



వైరారూరల్: రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో..



తల్లాడ: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ సురేష్ బాబు, ఉద్యోగులు



కొణిజర్ల: గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో.. నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఏన్కూరు: మూలపోచారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

ప్రపంచ స్థాయిలో పోటీ పడాలి



విద్యార్థినులకు యూనిఫాం, నోట్‌పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సౌకర్యాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన యూనిఫాం, నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోటీ తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మోటివేషన్ క్లాసులను సద్వినియోగం చేసుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, తోట సుజలరాణి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, చిల్లగుళ్ల వెంకటేశ్వరరావు, యూనిస్, జీవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకే..

పెనుబల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు మోటివేషన్(ప్రేరణ) క్లాసులు వారికి ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని ప్రిన్సిపాల్ స్వరూప రాణి తెలిపారు. మంగళవారం పెనుబల్లిలోని లంకపల్లి గురుకుల ఉన్నత పాఠశాలలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌లో.. విద్యార్థులు చదువు, అమ్మ, నాన్న, జీవిత నడవడికల గురించి తెలుసుకుని గుండెలు పిండేలా రోధించారు. దీంతో విద్యార్థులను ఎమ్మెల్యే, దయానంద్ ఓదార్చి.. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, కరీముల్లా, మోటివేషన్ క్లాస్ టీమ్ సూధాకర్, రంజిత్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌లైన్లు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో పేదలు 11 కేవీ విద్యుత్‌లైన్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం కాలనీలో పర్యటించిన ఆయన కరెంట్ తీగలు కిందకు వేళాడుతూ.. ఇళ్లపై నుంచి వెళ్తున్నాయన్నారు. అధికారులు వీటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్, నాగరాజు, రాజు, వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, సూరయ్య, వెంకట్ పాల్గొన్నారు.

కొత్త రోడ్డు నిర్మించండి



ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు

కొణిజర్ల: మండల కేంద్రానికి సమీపంలోని బస్వాపురం – గోపవరం వరకు ధ్వంసమైన బీటీరోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గోపవరం సెంటర్లో ధ్వంసమైన గుంటలను పూడ్చాలని కోరుతూ సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతల కారణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిపివేశారని, ముఖ్యంగా బస్వాపురం, గోపవరం గ్రామాల మధ్య ఎటువంటి వాహనం కూడా తిరిగే పరిస్థితి లేదన్నారు. దీనికి తోడు వర్షాలకు రోడ్డు కుంగిపోయిందన్నారు. కావున ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, కృష్ణయ్య, మండల కార్యదర్శి కుటుంబరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ మధిర నియోజకవర్గ అధ్యక్షుడిగా వీరయ్య



వీరయ్య

బోనకల్: ఎల్‌ఐసీ ఏజెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా మధిర డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన దొప్ప వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం బోనకల్‌లో నిర్వహించిన మధిర డివిజన్ సమావేశంలో వీరయ్యతో పాటుగా.. కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వితరణలు వెల్లువ

దివ్యాంగుడికి వీల్ చైర్..



దివ్యాంగుడికి వీల్ చైర్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: మండలంలోని లింగన్నపేటకు చెందిన దివ్యాంగుడు అంగడాల పుల్లయ్యకు గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు జాలా పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకుని వీల్ చైర్ వితరణ చేశారు. మంగళవారం వైరాలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ చేతుల మీదుగా చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్‌రావు, డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, చింతోజు నాగేశ్వరరావు, ఉండ్రు వరలక్ష్మి, తోటకూర శ్రీకాంత్, కిషన్‌రాయ్, రామకృష్ణ, మహాలక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు..



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: మండలంలోని ఒడ్డుగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు మంగీలాల్ స్నేహితుల సహకారంతో అందించిన బ్యాగులను ఎంఈఓ జయరాజు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం టి.శారద, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను రద్దును ఉపసంహరించుకోవాలి

బోనకల్: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై 11శాతం పన్ను రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎం.గిరి డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం పత్తి టారీఫ్ ప్రతులను దగ్ధం చేశారు. పత్తి క్వింటాకు రూ.10,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రవి, లక్ష్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు నేర్పేదే వేమన శతకం

కల్లూరు: ఉపాధ్యాయులు తరగతి గదుల్లో తెలుగు పాఠాలతో పాటు వేమన పద్యాలు కూడా బోధించినట్లైతే విద్యార్థులకు మాతృబాషతో పాటు విలువలు, వివేకం అలవడుతాయని ఎంఈఓ పత్తిపాటి నివేదిత పేర్కొన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా మంగళవారం కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించని సమావేశంలో.. గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్, ఆశా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రచురించిన వేమన శతక పద్య పుస్తకాలను ట్రస్ట్ నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, మధుసూధనరాజులు.. ఎంఈఓకు అందించారు. ఈ సదర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వేమన శతకం చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్, టి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించాలని వినతి



తహసీల్‌లో వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

తల్లాడ: రైతులకు సరిపడా యూరియా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిలభారత రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తల్లాడ తహసీల్‌లో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం అన్నారు. పత్తి పైరుకు కనీస మద్దతు ధర రూ.10,075 లుగా నిర్ణయించాలని, నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల చట్టాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ లాల్‌మియా తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆస్పత్రిని ప్రారంభించాలి

కల్లూరు: నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రిని ప్రారంభించి పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు కోరారు. ఈ మేరకు మంగళవారం సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు వినతిపత్రం అందించారు. పాత ఆస్పత్రిలో సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు ఉండాల్సి వస్తుందన్నారు. భవనం కూడా ఎప్పుడు కూలుతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున నూతన ఆస్పత్రిని ప్రారంభించి వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు బట్టు నరసింహారావు, నాయుడు, రావి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ

పెనుబల్లి: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం కృష్ణయ్య అన్నారు. మంగళవారం వీఎంబంజర్‌లోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అవలంభిస్తున్న పెన్షన్ వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెనుబల్లి మండల విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా టి.వి.రామారావు, తాండ్ర రాజేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కేశవరెడ్డి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఖమ్మం శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య, సహాయ కార్యదర్శి వి.చెంచిరెడ్డి, కాటమరాజు, ముస్తఫా, ఛాంద్‌సాహెబ్, దేవసహాయం, బజ్జూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● **ప్రయాణం సాగేదెలా..**

ముదిగొండ: మండలంలోని పలు లోలెవల్ వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందికరంగా మారాయి. పెద్దమండవ – మల్లారం, ఏపీలోని మల్కాపురం వెళ్లడానికి ఈ దారి గుండానే రైతులు అధికంగా ప్రయాణం సాగిస్తుంటారు. అనుకూలంగా ఈ రహదారిపై ఇసుక ట్రాక్టర్లు తిరగడంతో వంతెన పూర్తిగా దెబ్బతింది. ఇటీవల నూనత బీటీ రోడ్డు వేసి, మార్గమధ్యలో చాప్టాకు మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కావున అధికారులు స్పందించి లోలెవల్ చప్టాను మెరుగుపరచాలని పెద్దమండవ, మల్లారం ప్రజలు కోరుతున్నారు.



పెద్దమండవ - మల్లారం, మల్కాపురం రహదారి మధ్యలో ధ్వంసమైన వంతెన

● **యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..**



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

వేంసూరు: ఇటీవల కురిసిన వర్షాలకు కట్టలేరుకు భారీ వరద రావడంతో ఇసుక మేటలు వేసింది. రామన్నపాలెంలోని లిఫ్ట్ సమీపంలో భారీగా ఇసుక మేటలు వేయడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మూడు రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లపేరుతో వందలాదిట్రాక్టర్ల ఇసుకను బయటకు తోలారని, ఇంకెనాళ్లు ఇలా అక్రమాలకు పాల్పడతారని నిలదీశారు. గ్రామ అవసరాలకు కాకుండా బయటకు తోలడం ఎంటని ప్రశ్నించారు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో పలువురు గ్రామపెద్దలు ఇకపై ఇసుక అక్రమ రవాణా జరగదని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ట్రాక్టర్లను వదిలేశారు.

పామాయిల్ కార్మికులను గుర్తించాలి



పామాయిల్ కార్మిక సంఘం మండల కమిటీ

సత్తుపల్లిరూరల్: పామాయిల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దారంలో రేగుల కొత్రాజులు అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లి ప్రాంతంలో పామాయిల్ పండించే రైతులకు, ఫ్యాక్టరీ యాజామాన్యాలకు ప్రభుత్వం రుణాలు ఇస్తుంది కానీ తోటలో పనిచేసే కార్మికులను మాత్రం నేటికి గుర్తించలేదన్నారు. పామాయిల్ గెలలు నరికే సమయంలో కార్మికులు పడే ఇబ్బందులు అన్ని ఇన్ని కావన్నారు. పాలకులు మారుతున్నారే తప్ప కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. అనంతరం మండల నూతన మండలకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రేగుల కొత్రాజులు, ఉపాధ్యక్షుడిగా వాసం కిషోర్, సహాయ కార్యదర్శిగా తడికమళ్ల అర్జున్, కోశాధికారిగా తోటకూర రాజు, వీరితో పాటు ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ యలగం కృష్ణ, రాములు, పామాయిల్ కార్మికులు పాల్గొన్నారు.